

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# భూమి - ఆకాశం

సూపరింటెండింగ్ ఇంజనీర్ సుందర్రావు సకుటుంబంగా వచ్చి గెస్ట్ హౌసు లో దిగారు. ఆయన వచ్చినప్పటి నుంచీ అక్కడి ఆఫీసర్లు అతిథి మర్యాదలు చేయటంలో మునిగి పొయ్యారు. ఆయనకూ, ఆయన కుటుంబానికీ బ్రహ్మరథం పడుతున్నారు.

సుందర్రావు భార్య భానుమతి ఆఫీసరు భార్య చూపించే దర్పం అంతా చూపిస్తోంది. టిఫిన్లు, భోజనాలు ఏయే అయిటమ్స్ కావాలో చెబుతోంది. ఆ చుట్టుపక్కల చూడవలసిన ప్రదేశాలకు ఎప్పుడెప్పుడు తీసుకెళ్ళాలో కూడా చెబుతోంది. ఆమె మాటలన్నీ ఆ ఉద్యోగులకు ఆర్మీ చీఫ్ ఆర్డర్స్ లాంటివే గనుక అన్ని నిముషాల మీద జరిగిపోతున్నాయి.

ఇక్కడికి రావాలని ఆమె ఆరు నెలల నుంచీ పోరుతుంటే సుందర్రావు ఎప్పటి కప్పుడు ఏదో ఒక సాకుతో వాయిదా వేస్తూ వచ్చాడు. చివరకు ఇంక తప్పనసరి అయి బయలు దేరాడు.

వచ్చినప్పటి నుంచీ గెస్టు హౌసు కాంపౌండులో ఒక మూల నున్న అవుట్ హౌసు మీదే ఆయన దృష్టి నిలిచి పోయింది. మధ్యలో ఎవరో వస్తున్నారు. కబుర్లు చెబుతున్నారు. వెళ్తున్నారు. అలా అంతరాయం కలిగినప్పుడు తప్ప ఆయన దృష్టి అంతా ఆ అవుట్ హౌసు మీదనే వున్నది.

కాంపౌండ్ గేటు దగ్గర కనిపిస్తున్న అ చిన్న గదికి పెద్ద చరిత్ర వుంది. నిజానికి ఆ చుట్టు పక్కల ప్రాంతాలన్నీ చారిత్రాత్మక ప్రాంతాలుగా ప్రసిద్ధి చెందినా, ఆయనకు మాత్రం ఆ అవుట్ హౌసు గది చరిత్ర మాత్రమే ముఖ్య మైనదిగా అనిపిస్తున్నది.

భానుమతీ, పిల్లలూ రెడీ అయ్యారు. బయట జీపు సిద్ధంగా వుంది. ఆమె పైట సవరించు కుంటూ వచ్చి "ఇంక వెళ్దామా?" అన్నది.

"మీరు వెళ్ళి రండి భానూ, నాకు తల నొప్పిగా వుంది. కాసేపు రెస్టు తీసు కుంటాను." అన్నాడాయన.

"అది ఎలా కుదురుతుంది ? మీరు లేకుండా మేం ఎలా వెళ్తాం ? " అన్నది భానుమతి.

" ఏమ్ ఫర్వా లేదు. వాళ్ళు మిమ్మల్ని నెత్తి మీద పెట్టుకుని చూస్తారు. ఇవన్నీ నేను చాలా సార్లు చూసినవే. ఇప్పుడు కొత్తగా చూసేదేమీ లేదు. బయట తిరిగితే ఈ గాలికి తల నొప్పి మరింత ఎక్కువ అవుతుంది. మీరు వెళ్ళి రండి. " అని నచ్చ చెప్పాడు.

భానుమతీ, పిల్లలూ జీపులో వెళ్ళి పొయారు.

వరండా లో పచార్లు చేస్తున్న సుందర్రావు దగ్గరకు పరుగెత్తు కుంటూ వచ్చాడు వాచ్ మన్ చలపతి.

"ఏమన్నా తెమ్మంటారా సార్ ?' అని అడిగాడు చలపతి.

"ఏమీ అక్కర్లేదు. గది శుభ్రం చేయలేదు. పని మనుషులు ఎవరూ లేరా ?"

"ఇప్పుడే శుభ్రం చేస్తాను సార్, పొద్దుటే వచ్చినాను సార్, తమరు నిద్ర పోతున్నారు. అమ్మ గారు తరువాత రమ్మన్నారు ,,, "

"చూడూ, ఆ అవుట్ హౌసు లో ఎవరు ఉంటున్నారు ?"

"నేనే సార్"

"నీకు పెళ్ళి అయిందా ? పిల్లలు ఎంత మంది ?" అని అడిగాడు సుందర్రావు సిగరెట్టు వెలిగిస్తూ.

"నాకు పెళ్ళి అయింది సారూ, ఒక్కతే కూతురు. నా భార్య చనిపోయి రెండేళ్ళు అయింది సార్" అన్నాడు చలపతి.

"అరెరె ... నీ భార్య పేరు ఏమిటన్నావు ?"

" కనకం అండయ్యా"

"ఎంత కాలం నుంచి వుంటున్నావు ఇక్కడ ?"

"దగ్గర దగ్గర ఇరవై ఏళ్ళు అవుతాందండి..మాకు పెళ్ళి అయిన వెంటనే కూతురు పుట్టిందండి..."

"నీ కూతురు పేరు ఏమిటన్నావ్ ?"

"సావిత్రి అండి.. నా భార్యకు సినిమా పిచ్చి లెండి. సినిమా నటి సావిత్రి అంటే దానికి ఇష్టం. అందుకే సావిత్రి పేరు పెట్టుకుంది. మా అమ్మాయి మొహం లో మంచి కళ ఉందని అందరూ అంటారండి..." అని చెప్పు కున్నాడు చలపతి తన కుటుంబం గురించి.

సుందర్రావు నవ్వబోయి ఆగి పొయ్యాడు. "అంత అందంగా ఉంటుందా నీ కూతురు ? ఏదీ, పిలువు చూద్దాం ..."

చలపతి గబగబా అవుట్ హౌసు వైపు వెళ్ళాడు. అయిదు నిముషాల తరువాత చలపతి వెనకాల అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి సుందర్రావు ముందు తలొంచుకొని నిలబడింది సావిత్రి.

సుందర్రావు ఆ అమ్మాయిని నిశితంగా చూసాడు. అదే ముహం...అదే నడక...అదే వినయం.... సావిత్రి లో కనకమే కనబడింది సుందర్రావు కి.

" అట్టా గుడ్లు అప్పగించి చూస్తావేమే ? అయ్య గారికి దణ్ణం పెట్టు " అన్నాడు చలపతి.

సావిత్రి చటక్కున ముందుకు వంగి ఆయన పాదాలకు నమస్కరించింది. అయనకు ఏమని దీవించాలో తెలియ లేదు.

సావిత్రి చీపురు తీసుకుని గదిలోకి వెళ్ళింది. అయిదు నిముషాల్లో గది శుభ్రం చేసి, బెడ్ షీట్స్ మార్చింది.

అప్పుడు కనకమూ ఇలాగే అయిదు నిముషాల్లో అన్నీ సిద్ధం చేసేది. స్నానానికి నీళ్ళు రెడీగా ఉన్నాయని చెప్పేది.

టిఫేన్లూ, కాఫీలు తెచ్చి పెట్టేది. "పేదోళ్ళం మా టిఫిన్లు మీకు నచ్చవు లెండి" అనేది. మొహమాటానికి తను మెచ్చుకున్నా అవి ముహ ప్రీతి మాటలని ఇట్టే పసిగట్టేది.

కనకం పెద్దగా చదువు కోక పోయినా లోకగ్నానం బాగా తెలిసిన మనిషి. తన పరిధిలూ, పరిమితులూ అన్నీ తెలుసు. అయినా తన దగ్గర మాత్రం లక్ష్మణ రేఖను దాటేసింది. అన్ని పరిధులనూ కావాలనే అధిగమించింది.. అన్ని పరిమితులనూ చెరిపేసింది. సర్వార్పణ మస్తు అయిపోయింది.

"కనకం, ఇద్దరం కల్సి తప్పు చేస్తున్నాం. కానీ నేను తప్పించుకో గలను. నీకా అవకాశం లేక పోవచ్చు. అలాంటి పరిస్తితి వస్తే..." అని అన్నాడు సుందర్రావు.

"నా నుంచి తప్పించుకోగలరు. కానీ మీ అంతరాత్మ నుంచి తప్పించుకోలేరు..." అన్నది కనకం అదే నిర్మల మైన నవ్వుతో.

పని వున్నా, లేకున్నా కనకం కోసమన్నా నెలకీ, రెండు నెలలకీ అప్పట్లో ఇక్కడికి వస్తుండే వాడు. ఒక రోజు కనకం చెప్పింది తను ఒట్టి మనిషిని కాదు అని. ఆ మాటలు అంటున్నప్పుడు మాత్రం ఎప్పటిలా తేలికగా నవ్వలేక పోయింది. భయం, ఆందోళన అమె మొహం లో స్పష్టంగా కనిపించాయి.

సుందర్రావు కీ, కనకానికీ మధ్య భూమికీ, అకాశానికీ మధ్య ఉన్నంత వ్యత్యాసం ఉంది. రెండూ ఎక్కడో దూరంగా కలుసుకున్నట్లు కనిపిస్తాయి గానీ అవి ఎప్పటికీ కలవవు అని సుందర్రావు కి తెలుసు. చివరిసారిగా కన్నీళ్ళతొ వీడ్కోలు చెబుతూ "మర్చిపోకండి. మీరు తండ్రి కాబొతున్నారు " అన్నది కనకం.

ఆ తరువాత నుంచీ ఇక్కడకు రావటం మానేసాడు. ఇప్పుడు కూడా భానుమతి ఒకటే పోరు పెడితే వచ్చాడు.

అంతరాత్మ నుంచి తప్పించుకోలేరన్న కనకం మాటల్ని అయన మర్చిపోలేదు.

సావిత్రి మొహం లో కనకం కనిపిస్తోంది.

"తల నొప్పిగా ఉందన్నారంట. అమ్రుతాంజనం రాయనా...తండ్రి లాంటోరు." అన్నది సావిత్రి.

సుందరావు నిట్టూర్చాడు.

"నువ్వు ఇక్కడ ఇలాగే గదులు శుభ్రం చేస్తుంటావా ?" అని అడిగాడు సుందర్రావు. అది అర్థం లేని ప్రశ్న అని అయనకూ తెలుసు. కానీ అయన మనసులో ఉన్న భావం వేరు. కనకం లాగానే సావిత్రి కూడా తొందర పడితే ... ఎవరి వలలో నన్నా పడితే... ఆ పిల్ల చెడి పోకూడదన్న భావం అయన్ని స్తిమితంగా ఉండనివ్వలేదు.

ఆఫీసు వాళ్ళు వచ్చారు. కాంట్రాక్టర్లూ వచ్చారు. కాసేపు వాళ్ళ సమస్యలు చెప్పు కున్నారు. "మీరే మా సమస్యలను పరిష్కరించా"లని కోరారు. పోతూ పొతూ లక్ష రూపాయలు అయన ముందు పెట్టి వెళ్ళారు.

సుందర్రావు చలపతి ని పిల్చాడు. ఆ డబ్బు చలపతికి ఇచ్చాడు.

"సావిత్రి పెళ్ళి చెయ్యి చలపతీ, ఎదిగిన పిల్లను ఎంతో కాలం ఇంట్లొ ఉంచుకోవటం మంచిది కాదు" అన్నాడు సుందర్రావు.

"తమరు దర్మ ప్రెబువులు.." అన్నాడు చలపతి వంగి సుందర్రావు కాళ్లకు మొక్కుతూ.

★★★

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.